సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



అమ్మ ఆశీర్వాదం కోసం

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడవ జాతర మంగళవారం కనులపండువగా జరిగింది.

- 8లో



11న గ్రూప్-2 ఎగ్జామ్‌పై మాక్ టెస్ట్

గ్రూప్-2 మాక్‌టెస్ట్‌ను ఉత్తరాంధ్ర జిల్లాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని బొత్స సందీప్‌బాబు కోరారు.

- 8లో

అమ్మ గెలిచింది



ఆమెకు ముగ్గురు కుమార్తెలు పుట్టడంతో భర్త విడిచి పెట్టాడు.
అయినా, ఆమె కుంగి పోలేదు. కాయకష్టాన్ని నమ్ముకుంది. ముగ్గురినీ ప్రయోజకులుగా తీర్చిదిద్దింది.

- 8లో

న్యూస్‌రీల్

1,75,891మందికి ఆల్బెండజోల్ మాత్రలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



పార్వతీపురం టౌన్: జిల్లాలో 1,75,891 మంది చిన్నారులు, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.బి.జగన్నాథరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ జిల్లాలో 84,426 మంది బాలురు, 88,465 మంది బాలికలకు 400 మిల్లీ గ్రాముల మాత్రలను ఉచితంగా అందజేస్తామన్నారు. 1నుంచి 5 సంవత్సరాల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోను, 6 నుంచి 19 సంవత్సరాల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలలో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. భోజనం అనంతరం మాత్రలు వేయించాలన్నారు. ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్ ఉండవని, మాత్రలు వేసిన అనంతరం ఎటువంటి అనారోగ్య లక్షణం కనిపించినా వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. 1 నుంచి 2 సంవత్సరాల చిన్నారులకు అరమాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న విద్యార్థులకు ఒక మాత్రను మింగించాలన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, కడుపునొప్పి, ఆందోళన, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఆల్బెండజోల్ మాత్రలతో ఇవన్నీ నివారణ అవుతాయని పేర్కొన్నారు.

డీఈఓగా బంగారమ్మ

విజయనగరం అర్బన్: పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓగా శ్రీకాకుళం జిల్లా టెక్కలి డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న జి.పగడాలమ్మను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ డీఈఓగా పనిచేసిన ప్రేమ్‌కుమార్ విజయనగరం డీఈఓగా బదిలీ అయ్యారు. విజయనగరం డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి ఆర్‌జేడీగా పదోన్నతి పొందారు.

కరాటే పోటీల్లో దీపక్‌కు బంగారుపతకం



లక్ష్మీదీపక్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ మహేశ్వరరావు తదితరులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో గల వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎల్.లక్ష్మీదీపక్ అంతర్‌జాతీయ కరాటే పోటీల్లో బంగారుపతకం సాధించినట్లు కరస్పాండెంట్ కోట్ని మహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 3,4 తేదీల్లో విశాఖపట్నంలో గల పోర్టు స్టేడియంలో ఆల్ స్టైల్ ఇంటర్‌నేషనల్ 7వ కరాటే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో లక్ష్మీదీపక్ అండర్-16 విభాగంలో బంగారుపతకం, అండర్-17 విభాగంలో సిల్వర్ పతకాన్ని సాధించినట్లు తెలిపారు. ఈమేరకు కళాశాల ఆవరణలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి లక్ష్మీదీపక్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మొయిద లక్ష్మణరావు, కుమార్‌బాబు, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ బాధ్యత అందరిదీ

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎక్కడా ఎటువంటి నిబంధనల ఉల్లంఘన జరగరాదని హెచ్చరించారు. తహసీల్దార్లు తమ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, డిజిటల్ కీలను భద్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాలు, 154 సెక్టార్లున్నాయన్నారు. 800 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పెట్టేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలింగ్ రోజున ఆన్‌లైన్‌లోనే ఓటింగ్ వివరాలును నమోదు చేయాలన్నారు. ఈవీఎంలు వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీచేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మాత్రమే పట్టాలు, పాస్‌బుక్‌లు, వన్‌బి వంటివి జారీచేయాలన్నారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పీఓలు కల్పనాకుమారి, విష్ణుచరణ్, కేఆర్‌సీ ఎస్‌డీసీ కేశవ నాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓలు కె.హేమలత, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉద్యానవన రైతులకు ఉపాధి

- ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- 100 శాతం సబ్సిడీతో మొక్కల పంపిణీ
- సాగుచేసే రకాన్ని బట్టి చెల్లింపులు
- సంబంధిత మండలాల్లోనే దరఖాస్తు చేసుకునే వెసులబాటు
- మార్చి నుంచి ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- అంతరపంటల సాగుకు ప్రోత్సాహం
- జిల్లాలో ఉద్యానవన రైతులు 1.3,11 మంది
- సాగు విస్తీర్ణం 1641 హెక్టార్లు



జీడి మామిడి తోట



సాలూరులో బంతిపూల తోట (ఫైల్ ఫోటో)

పార్వతీపురంటౌన్: జిల్లా రైతులకు శుభవార్త. ఉద్యానవనాలు, దానిలో అంతర పంటలు సాగుకు ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం శతశాతం రాయితీ కల్పిస్తోంది. మొక్కల పెంపకానికి అయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. పొలాన్ని దుక్కి చేసుకోవడానికి, గుంతలను తవ్వించడానికి, మొక్కల కొనుగోలుకు, రవాణా ఖర్చులు, కలుపుతీత ఖర్చులు సైతం బిల్లులు చెల్లిస్తోంది. మూడేళ్ల వరకూ మొక్కల పెంపకానికి అవసరమయ్యే నీటి బిల్లులు, కాపాలాదారు బిల్లులు ఇస్తోంది. కాపాలాదారుకు నెలకు ఎకరానికి రూ.1150 చొప్పున 5 ఎకరాల వరకూ అందజేస్తోంది. రైతులు సాగు చేసే పంట రకాన్ని బట్టి ప్రభుత్వం డబ్బు చెల్లిస్తోంది. ఒక సంవత్సరానికి ఎకరా మామిడితోటకు రూ 1.05 లక్షలు, దానిమ్మ తోటకు రూ 1.06 లక్షలు ఇలా పంట రకాన్ని బట్టి లక్షకు తగ్గకుండా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఓ వైపు ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించడంతో పాటు రైతులకూ 'ఉపాధి' కల్పిస్తోంది.

అంతర పంటల ప్రోత్సాహం

పండ్ల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు అదనపు ఆదాయం సమకూర్చేలా 2024-25 నుంచి పండ్ల మొక్కలతో పాటూ అంతర పంటగా మునగ, పూల మొక్కలు (కనకాంబరాలు, రోజా, మల్లెలు)ఏదో ఒకటి అంతర పంటగా సాగు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. పండ్ల మొక్కలు సాగు చేసిన నాటి నుంచి పంట చేతికొచ్చేందుకు దాదాపు ఐదు సంవత్సరాల సమయం పడుతుంది. ఈ సమయంలో రైతు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అంతర పంటగా పూల తోటలు సాగుకు ప్రోత్సాహించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టింది. ఎకరా విస్తీర్ణంలో పూలసాగు చేసుకునే అవకాశం కల్పించింది.

జిల్లాలో ప్రస్తుతం ఉద్యానవన సాగు వివరాలిలా...

నియోజకవర్గం	రైతులు	సాగు విస్తీర్ణం హెక్టార్లలో
కురుపాం	776	891
పార్వతీపురం	63	76
పాలకొండ	242	344
సాలూరు	230	330

మార్చి నెల నుంచి దరఖాస్తుల స్వీకరణ

మెట్ట భూములున్న రైతులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ ఏడాది జిల్లాలో డ్రైల్యాండ్ హార్టి కల్చర్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2024-25 సంవత్సరంలో ఉద్యానవనాల సాగుకు మార్చి నెలనుంచి దరఖాస్తు చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించింది.

ఐదు ఎకరాలలోపు మెట్ట భూమి ఉన్న రైతులు డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకానికి అర్హులు. అలాంటి రైతులు గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. తక్కువ విస్తీర్ణంలో ఉన్న రైతులు సైతం పూల మొక్కల సాగు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

వంద శాతం రాయితీ



ఉపాధిహామీ కింద పండ్లతోటల సాగుకు ముందుకు వచ్చే రైతులందరికీ ప్రభుత్వం వందశాతం సబ్సిడీని ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ఆసక్తి కలిగిన రైతులంతా సంబంధిత మండలాల్లోనే దరఖాస్తు చేసుకోవచ్చు. రైతులు ఇబ్బంది పడకుండా మొక్కలు నాటిన పొలంలోనే అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. అందుకు మార్చి నెలనుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాం.

– రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

లక్కీ గిఫ్ట్ స్కీమ్ విజేతలకు బహుమతులు



ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆదినారాయణ


విజయనగరం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాన్ని ప్రోత్సహించడంతో భాగంగా నిర్వహించిన లక్కీ గిఫ్ట్ స్కీమ్ విజేతలకు కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆర్టీసీ అధికారులు మంగళవారం అందజేశారు. విజయనగరం డిపో నుంచి సింహాచలం, ఆంధ్ర, చీపురుపల్లి-మెరకముడిదాం, విజయనగరం వయా జామి, ఎస్.కోట మార్గాల్లో జనవరి 16 నుంచి 30వ తేదీ వరకు అందించిన సర్వీసుల్లో ప్రయాణం చేసిన వారిని స్కీమ్‌కు అర్హులుగా తీసుకున్నారు. టికెట్స్ ఆధారంగా డ్రా తీసి గిఫ్ట్ స్కీమ్‌లో ఎంపికైన పలువురికి బహుమతులను డిపో అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ పి.రామారావు, స్టేషన్ మేనేజర్ పి.సత్యనారాయణ, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

పథకాల పేరుతో వివరాల సేకరణ



ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న బాధితులు

- ఆధార్, బ్యాంకు ఖాతా, ఓటీపీ వివరాల నమోదు
- పేదలు, నిరక్షరాస్యులే టార్గెట్
- భయపడుతున్న గ్రామీణ ప్రజలు
- పోలీసులకు ఫిర్యాదు



Saturday · 2:19 pm

TDP అధికారంలోకి రాగానే భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వారా మీ కుటుంబానికి వచ్చే ప్రయోజనాలు సందేశాలు ద్వారా తెలుసుకొనుటకు మీకు సమ్మతం అయితే మీకు వచ్చిన OTP 452871 ని స్వచ్ఛందంగా టీడీపీ వారికి ఇవ్వండి.
TDP

Savarala suresh, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీలో మీ నమోదు సంఖ్య 66013016857 మీ సంక్షేమ వివరములకు www.tdpmanifesto.com/p/?i=9lGhOO - ధన్యవాదములతో - TDP

టీడీపీ కార్యాలయం నుంచి వారికి వచ్చిన మెసెజ్‌లు

సాలూరు: పథకాల అందజేస్తామంటూ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు వివరాలు సేకరించారని, మా ఖాతాలో డబ్బులు కాజేసే అవకాశం ఉందని, చర్యలు తీసుకోవాలంటూ సాలూరు మండలం పెదపదం పంచాయతీ బాగువలసకు చెందిన సవరాల పైడితల్లి, కరుణమ్మ, సురేష్‌కుమార్‌లు రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఈ నెల 4వ తేదీన బాగువలస గ్రామానికి చెందిన ఏంద్రాపు అప్పలస్వామి, మత్స అప్పలనాయుడు అనే వ్యక్తులు టీడీపీ నాయకులమని చెబుతూ.. టీడీపీ అధికారంలోకి వస్తే బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కింద పథకాలు మంజూరుచేస్తామని బాధితులను నమ్మించారు. పథకాలు రావాలంటే తక్షణమే ఫోన్ నంబర్, ఆధార్ నంబర్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుందని, బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు పడతాయని నమ్మించి ఓటీపీని తీసుకున్నారు. కేవలం పేదలు, నిరక్షరాస్యుల వద్దే వివరాలు సేకరించడంతో వారికి అనుమానం వచ్చింది. మాయమాటలతో నమ్మించి వివరాలు తీసుకున్న వ్యక్తులపై సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంటకు రుణ సౌకర్యం పెంపు

పార్వతీపురం: పంటలకు రుణ సౌకర్యం పెంచేందుకు జిల్లా కన్సల్టేటివ్ కమిటీ తీర్మానించింది. జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్ కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. వివిధ పంటలకు రుణ సౌకర్యం పెంచేందుకు కమిటీ నిర్ణయించింది. సమావేశంలో లీడ్ బ్యాంకు అధికారి నాగప్రవీణ్, నాబార్డు డీఎం నాగార్జున, లీడ్‌బ్యాంకు మేనేజర్ మూర్తి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పంట రకం	గతేడాది రుణ సదుపాయం	పెంపు ఇలా..
వరి	రూ.38వేలు- 42వేలు	రూ.42వేలు-రూ.45 వేలు
చెరకు(ప్లాంటేషన్)	రూ.77 వేలు-రూ.80 వేలు	రూ.82 వేలు-రూ. 85 వేలు
చెరకు (కటూన్)	రూ.66వేలు - రూ.70 వేలు	రూ.70వేలు-రూ.75 వేలు
అరటి (ప్లాంటేషన్)	రూ.65వేలు - రూ.80 వేలు	రూ. 85వేలు - రూ.95 వేలు
అరటి(కటూన్)	రూ.45వేలు - రూ.60వేలు	రూ. 60వేలు - రూ.75 వేలు

కౌలు రైతులకు రుణాలు మంజూరుచేయాలి

జిల్లాలో రుణాలు అందని 1200 మంది కౌలు రైతులకు తక్షణమే మంజూరు చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ బ్యాంకర్లకు సూచించారు. జగనన్న ఆసరా, చేయూత వంటి పథకాల పంపిణీ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో చేపడుతున్న సమయంలో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటుచేసి అర్హులను నమోదు చేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న ప్రాధన్యతా కార్యక్రమాల్లో బ్యాంకులు భాగస్వాములు కావాలని, జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. 2023 డిసెంబర్ నాటికి ప్రాధాన్యతా రంగానికి రుణ లక్ష్యం రూ.2,529 కోట్లు కాగా, రూ.2,350 కోట్లు మంజూరుచేసి 93 శాతం లక్ష్యాలను సాధించినట్టు వెల్లడించారు. ప్రాధాన్యేతర రంగానికి రుణ లక్ష్యం రూ.438 కోట్లు కాగా రూ.590 కోట్లు మేర రుణాలు మంజూరుచేసి 135 శాతం లక్ష్యాలు సాధించడం అభినందనీయమన్నారు. పీఎం జన్‌ధన్ యోజన, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, ముద్రా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులకు లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి జీసీసీ కృషి

- రాష్ట్ర వ్యాప్తంగా 415 వన్‌దన్ వికాస్ కేంద్రాలు
- జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్



గిరిజనులతో మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్

పార్వతీపురం టౌన్: గిరిజనుల అభివృద్ధికి జీసీసీ కృషిచేస్తోందని, జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ తెలిపారు. పార్వతీపురం మండలం దేవుకోన, రావికోన, అడారు గ్రామాల్లో మహిళా స్వయంసహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస్ కేంద్రాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా క్రాంతి పథంతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా 415 వన్‌ధన్ వికాస్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గిరిజనులు పండించే అటవీ వ్యవసాయ ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం మహేంద్రకుమార్, వెలుగు ఏపీడీ సత్యంనాయుడు, మార్కెటింగ్ మేనేజర్ శేఖర్, రమణమూర్తి, ప్రవీణ్, ఇందిరాక్రాంతి పథం అధికారులు, జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

3,197 మందికి వైద్య సేవలు

పార్వతీపురంటౌన్:

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాలు జిల్లాలో కొనసాగుతున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాల్లో 3,197 మందికి వైద్యులు ఉచిత వైద్యసేవలు అందించారు.

అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు కోరారు.

జేఏఎస్ శిబిరాల్లో మంగళవారం అందించిన వైద్యసేవలు	
మండలాలు	15
వైద్యశిబిరాలు	6
మొత్తం ఓపీలు	3,197
స్పెషలిస్టుల ఓపీలు	1658
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు	1547
డీఎం	351
హెచ్‌టీఎన్	491
ఏఎన్‌సీ	67
పీఎన్‌సీ	39
అనీమియా	30
ల్యాబ్‌టెస్టులు	1764
ఈసీజీ పరీక్షలు	38
కంటి పరీక్షలు	388
రిఫరల్ కేసులు	14

రూ.4వేల కోట్లతో పీఎల్‌పీ



పీఎల్‌పీ ప్లాన్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పీఎల్‌పీ)ను రూ.4000.54 కోట్లతో రూపొందించారు. నేషనల్ బ్యాంకు ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) 2024-25 ఆర్థిక సంవత్సరానికి పీఎల్‌పీని తయారు చేసింది. ఈ క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టర్ కార్యాలయంలో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ ఆధారితమైనదని, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యకలాపాలకు ఆర్థిక సాయం అందించి రైతులకు మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించాలని బ్యాంకర్లకు సూచించారు. నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ నాగార్జున క్రెడిట్ ప్లాన్‌ను వివరించారు. పీఎల్‌పీను లీడ్ బ్యాంకు, బ్యాంకర్లు, ఆదర్శ రైతులు, వివిధ శాఖల అధికారులు, వివిధ సంస్థల సహకారంతో తయారుచేసినట్టు వెల్లడించారు. సమావేశంలో ఆర్‌బీఐ లీడ్ బ్యాంకు అధికారి నాగప్రవీణ్, లీడ్ బ్యాంకు మేనేజర్ జె.ఎల్.ఎన్.మూర్తి, డీసీసీబీ జీఎం కె.వాసు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, మత్స్య శాఖాధికారి తిరుపతయ్య, పరిశ్రమల శాఖాధికారి కురుణాకర్ తదితరులు ఉన్నారు.

10, 11 తేదీల్లో జిల్లా స్థాయి చెస్ పోటీలు

- జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-07, 09, 11, 13, 15 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించే పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. 7 రౌండ్లలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 8వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

మరిన్ని వివరాలకు సెల్: 97033 44488 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

బోటు బోల్తా: మత్స్యకారుడి మృతి



బ్రహ్మాజీ మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి తీరంలో మంగళవారం వేకువ జామున జరిగిన బోటు ప్రమాదంలో ఓ మత్స్యకారుడు మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చింతపల్లి గ్రామానికి చెందిన బర్రి బ్రహ్మాజీ (33) ఎప్పటి లాగానే తోటి మత్స్యకారులతో కలిసి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చింతపల్లి తీరంలో సముద్రంలోకి చేపల వేటకు బయలుదేరి వెళ్లారు. వేటకు బయలుదేరిన కొద్ది సమయానికే కెరటాలు ఉధృతంగా రావడంతో బోటు బోల్తా పడింది. ఆ ప్రమాదంలో బ్రహ్మాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. కొంతసేపు తరువాత తోటి మత్స్యకారులు బ్రహ్మాజీ మృతదేహాన్ని సముద్రం నుంచి ఒడ్డుకు చేర్చారు. బ్రహ్మాజీకి భార్య సుభద్ర, పిల్లలు భాను, దిల్లేష్ ఉన్నారు. ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వీరఘట్టం: మండలంలోని బల్లగుడ్డి పరిసర ప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో మంగళవారం ఉదయం ఎస్సై ఎం.గోవింద్ సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు వస్తున్నట్లు తెలియడంతో సారా తయారీదారు ఆరిక బాపయ్య పరారైనట్లు ఎస్సై చెప్పారు.

వంతెనపై అదుపు తప్పిన వ్యాన్



అదుపు తప్పిన వ్యాన్

కురుపాం: మండలంలోని గుమ్మగదబవలస గ్రామ సమీపంలో ఉన్న వంతెన పై మంగళవారం సాయంత్రం ఓ వ్యాన్ అదుపు తప్పింది. పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం డిగ్రీకళాశాలకు పరీక్ష పేపర్స్ తీసుకు వెళ్తుండగా అదుపుతప్పి గోడపై వ్యాన్ నిలబడి పోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు చెబుతున్నారు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేక పోవడంతో ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగాయని, అధికారులు స్పందించి రక్షణగోడలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తలకు తీవ్రగాయాలైన కొండగొర్రి సూర్యనారాయణ

కురుపాం: మండల కేంద్రం సమీపంలోని మూలిగూడ జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గుమ్మిడిగూడ పంచాయతీ దండుసూర గ్రామానికి చెందిన కొండగొర్రి సూర్యనారాయణ తన ద్విచక్ర వాహనంతో కురుపాం వైపు వస్తుండగా జంక్షన్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన వేగనియంత్రణ బోర్డులను ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య చికిత్స కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలిచారు. ఈ మేరకు కురుపాం ఎస్సై షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹124	₹218	₹228

అమ్మ ఆశీర్వాదం కోసం

- మూడో జాతరకూ పోటెత్తిన భక్తజనం
- దర్శించేందుకు బారులు తీరిన భక్తులు
- క్యూలు నిండిపోవడంతో ఎండలో నిరీక్షణ



మొక్కు చెల్లిస్తున్న పాచిపెంట ఎంపీపీ ప్రమీల



ట్రాక్టర్‌పై జాతరకు వస్తున్న భక్తులు



పోలమాంబ అమ్మవారు



జెడ్పీచైర్మన్ కుమార్తె సిరిసహస్రను స్వాగతిస్తున్న దేవాదాయశాఖ అధికారులు



అమ్మవారిని దర్శించుకుంటున్న సిరిసహస్ర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడవ జాతర మంగళవారం కనులపండువగా జరిగింది. తెల్లవారు జామునుంచి భక్తులు గ్రామానికి తరలివచ్చారు. సుదూర ప్రాంతాలనుంచి భక్తులు ట్రాక్టర్లతో అధికంగా వచ్చారు. తొలి, మారుజాతరలకు మించి భక్తులు మూడవ జాతరకు చేరుకోవడంతో, క్యూలన్నీ నిండిపోయాయి. దీంతో భక్తులు గోముఖి బ్రిడ్జివరకు ఎండలో అమ్మ దర్శనానికి వేచి చూడాల్సి వచ్చింది. భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ జె.బాలకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి, ఈవో వీవీ సూర్యనారాయణలు చర్యలు చేపట్టారు.

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అలాగే వనంగుడిలో ఉన్న పెదపోలమాంబ అమ్మవారిని, ఆలయం వెనుకన ఉన్న వేపచెట్టుకు భక్తులు పూజలు చేశారు. కోళ్లు, చీరలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వనంగుడి సమీపంలో భక్తులు భోజనాలు వండి, ఆరగించారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు.

అమ్మవారిని దర్శించిన చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు పోలమాంబ అమ్మవారిని జెడ్పీచైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు తనయ, చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర దర్శించుకున్నారు. ఈవో వి.వి. సూర్యనారాయణ ఆమెను సాదరంగా స్వాగతించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే పాచిపెంట ఎంపీపీ బద్రాన ప్రమీల, సాలూరు ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారిలు అమ్మవారిని దర్శించుకున్నారు.



క్యూలో భక్తులు



ఎండలో వేచి ఉన్న భక్తులు

11న గ్రూప్–2 ఎగ్జామ్‌పై మాక్ టెస్ట్

- ధీర ఫౌండేషన్ అధినేత సందీప్‌బాబు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఈనెల 11న జరగనున్న గ్రూప్–2 ఎగ్జామ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉత్తరాంధ్రలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల్లో మాక్‌టెస్ట్ నిర్వహించనున్నామని, ఆయా ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు ఈమాక్ టెస్టును సద్వినియోగం చేసుకోవాలని ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్‌బాబు తెలిపారు. ఈ మేరకు గరివిడిలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో గ్రూప్–2 మాక్‌టెస్టు నిర్వహణపై విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. ఈ సందర్భంగా మాక్ టెస్టు రాయబోయే అభ్యర్థులు dheerafoundation.com వెబ్‌సైట్‌లో లింకు ఓపెన్ చేసి తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ లింకులో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఈ నెల 9వ తేదీన ఎగ్జామినేషన్ సెంటర్ వివరాలను ఎంఎంఎస్, వాట్సాప్ మెసెజ్‌ల రూపంలో తెలియజేయనున్నట్లు చెప్పారు. కాంపిటేటివ్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేస్తున్నామని, జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు స్టడీ మెటీరియల్స్‌ను అందించామని పేర్కొన్నారు. గ్రూప్స్ ఎగ్జామ్స్‌కు ప్రిపేరవుతున్న అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని వారికి మోడల్ పేపర్‌ను తెలియజేయాలనే ఆలోచనతోనే ఈమాక్ టెస్టు నిర్వహిస్తున్నామన్నారు. గ్రూప్స్ ఎగ్జామినేషన్ పేపర్లను, మారిన సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని మాక్‌టెస్ట్ పేపర్లను రూపొందించినట్లు తెలిపారు. ఈ మాక్‌టెస్ట్‌కు హాజరయ్యే వారికి ఉచితంగా ఆన్‌లైన్ మెటీరియల్‌ను అందిస్తామన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులు సబ్‌స్క్రైబ్ అయ్యేందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. విద్య, ఉపాధి కల్పనకు చేదోడుగా నిలబడడమే ధీర ఫౌండేషన్ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనువాసులనాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, రెండు మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.



గ్రూప్-2 ఎగ్జామ్ మాక్‌టెస్టు నిర్వహణపై మాట్లాడుతున్న ధీర ఫౌండేషన్ అధినేత సందీప్‌బాబు

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రామునాయుడు(ఫైల్)

జామి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జామి మండలకేంద్రానికి చెందిన గొర్లె రామునాయుడు(24) విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ప్రమాదంపై మృతుడి తల్లిదండ్రులు అప్పలనారాయణ, రమణమ్మ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. రామునాయుడు మూడురోజుల క్రితం జామి నుంచి విశాఖపట్నం బైక్‌పై వెళ్తున్న సమయంలో తగరపువలసలో అవంతి కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శన మిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం చదురుగుడి, వనంగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

వెబ్‌సైట్‌లో ఫైనల్ మెరిట్‌జాబితా

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో ఖాళీల భర్తీకి సంబంధించి 9.11.2023 న ఇచ్చిన నోటిఫికేషన్‌లో బయో మెడికల్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఓటీ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించిన ఫైనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్ ఉద్యోగాన్ని ఏపీవీపీ ఉద్యోగితో నింపినట్లు తెలియజేశారు. ఈఎంటీ మూడు ఉద్యోగాలకు సంబంధించి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆదేశానుసారం రివైజ్డ్ నోటిఫికేషన్ వెబ్‌సైట్‌లో పెట్టినట్లు తెలిపారు.

ప్రతిభా పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం



మల్లిలోని ప్రతిభా కళాశాల

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాఠశాల, కళాశాలల్లో గిరిజన విద్యార్థుల ప్రవేశాలకు సొసైటీ రాష్ట్ర వైస్‌చైర్మన్ కాంతిలాల్ దండే నోటిఫికేషన్ జారీ చేశారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరడానికి మల్లి, జోగింపేట కళాశాలలు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నాయి. అలాగే స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 8వ తరగతికి జోగింపేటలో ప్రవేశం కల్పించనున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి వచ్చేనెల 25 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 7వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు రాతపరీక్ష నిర్వహించనున్నారు.

గిరిజన గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలు

2024–25 విద్యాసంవత్సరానికి గాను ఐదోతరగతిలో ప్రవేశానికి, 6వ తరగతి నుంచి 9 వరకు మిగులు సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. వివిధ జిల్లాల్లో ఏజెన్సీ, నాన్‌ఏజెన్సీ పరిధిలో విద్యార్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నారు. ఐదోతరగతిలో ప్రవేశానికి నాలుగో తరగతి పాసై ఉండాలి. మిగిలిన తరగతులకు వారి ముందు తరగతులు చదివి ఉత్తీర్ణులైన వారు అర్హులు.

అర్హతలు ఇలా..

ఐదోతరగతిలో ప్రవేశానికి ఓసీ, బీసీ, కులాలకు చెందిన విద్యార్థులు 1.6.2013 నుంచి 31.07.2015 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1.6.2011 నుంచి 31.7.2015 మధ్య జన్మించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించి ఉండరాదు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. పూర్తి సమాచారంతో కూడిన సమాచార పత్రం, దరఖాస్తు కోసం ఈనెల 15 నుంచి వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఏప్రిల్ 10వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించుకోవాలి. ఇతర వివరాలకు సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని ఉత్తర్వుల్లో సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పీఎల్‌పీయూఎస్ చైర్మన్ దుర్గయ్య

గంట్యాడ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రజోపయోగ సేవల శాశ్వత లోక్ అదాలత్ (పీఎల్‌పీయూఎస్) చైర్మన్ గరికిన దుర్గయ్య అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లను ఆశ్రయించాలని చెప్పారు. ప్రజోపయోగసేవల్లో ఏమైనా నష్టం జరిగితే ప్రజలు శాశ్వతలోక్ అదాలత్‌ను అశ్రయించవచ్చని చెప్పారు. సెషన్స్ కేసులో ఉన్న ముద్దాయిలకు బెయిల్, కేసుల విచారణ కోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ను సంప్రదించాలని చెప్పారు. తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి మాట్లాడుతూ జనన, మరణధ్రువీకరణ పత్రాల కోసం సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని, వివాహాలను రిజిస్ట్రర్ చేయించుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ గెలిచింది

ఆమెకు ముగ్గురు కుమార్తెలు పుట్టడంతో భర్త విడిచిపెట్టాడు. అయినా, ఆమె కుంగిపోలేదు. కాయకష్టాన్ని నమ్ముకుంది. భవన నిర్మాణ కార్మికురాలిగా మారింది. వచ్చిన కూలిడబ్బులతో పిల్లలను సాకింది. ప్రభుత్వ పాఠశాలల్లో ముగ్గురు కుమార్తెలను చేర్పించింది. చదువు విలువ తెలియజేసింది. తల్లి కష్టాన్ని కుమార్తెలు గుర్తించారు. చదువులో రాణించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైన వేళ పెద్దల అండదండలతో అవకాశాలను అందిపుచ్చుకున్నారు. ముగ్గురిలో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికకాగా, మరొకరు పీహెచ్‌డీ చేస్తున్నారు. అమ్మనమ్మకాన్ని గెలిపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

- తల్లినమ్మకాన్ని నిలబెట్టిన తనయలు
- సర్కారు కొలువుల సాధన



తల్లి బంగారమ్మతో కుమార్తెలు



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా ఎంపికైన రేవతి

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణం శ్రీనివాసకాలనీలో నివసిస్తున్న మాచిట్టి బంగారమ్మకు ముగ్గురు ఆడపిల్లలు. సరస్వతి, రేవతి, పావని. వీరిని విడిచి తండ్రి వెళ్లిపోయాడు. బంగారమ్మే కంటికి రెప్పలా సాకింది. భవన నిర్మాణ పనులు చేస్తూ వచ్చిన కూలి డబ్బులతో చదువులు చెప్పించింది. ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ వరకూ చదివిన 2వ కుమార్తె రేవతిని ఆర్థిక ఇబ్బందులతో ఒక దశలో చదువు మాన్పించాలనుకుంది. టెన్త్‌లో అత్యంత ప్రతిభ చూపిన రేవతికి స్థానిక పుణ్యగిరి విద్యాసంస్థల అధినేత ఎల్.సత్యనారాయణ తన కళాశాలలో ఉచితంగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కల్పించారు. అత్యధిక మార్కులు సాధిస్తే భవిష్యత్‌లో కోరిన చదువుకు తనే ఖర్చు భరిస్తానంటూ భరోసా ఇచ్చారు. రేవతి ఇంటర్మీడియట్‌లో 984 మార్కులు సాధించింది. ఎంసెట్‌లో ర్యాంక్ సాధించి గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసింది. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భర్తీచేసిన సచివాలయ ఉద్యోగాల్లో ధర్మవరం సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పోస్టు సాధించింది. అంతటితో వదిలేయకుండా ఏపీపీఎస్సీ పరీక్షలకు సాధన చేసింది. 2023 ఆగస్టులో పరీక్ష రాసింది. నవంబర్‌లో విడుదలైన ఫలితాల్లో విజయం సాధించింది. రేవతికి ప్రస్తుతం జోన్-1 పరిధిలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి మంగళవారం ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం రేవతి అక్క సరస్వతి ఏలూరులో సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తుండగా, చెల్లెలు పావని పీహెచ్‌డీ చేస్తోంది. ముగ్గురు అమ్మాయిలు చదువులో రాణించడంతో తల్లి బంగారమ్మ సంతోషపడుతోంది. పిల్లలు సాధిస్తున్న విజయాలతో ఉబ్బితబ్బిబ్బవుతోంది.